నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | నవంబర్ 11, 2024 | www.navatelangana.com

త్రిలింగ రామేశ్వర ఆలయంలో జిల్లా న్యాయమూర్తి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రి లింగ రామేశ్వర ఆలయంలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా నిజామాబాద్ జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో మహిమాన్విత క్షేత్రమైన త్రి లింగ రామేశ్వర ఆలయ దర్శనం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. వారి వెంట ఎస్ఐ మల్లారెడ్డి, ఏఎస్ఐ మహేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మ దత్తు ఉన్నారు.

ఎస్సారెస్పీకి స్వల్ప ఇన్‌ఫ్లో

- పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ప్రాజెక్టు



నవతెలంగాణ-మెండోరా

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీకి స్వలంగా 829 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. అదే స్థాయిలో నీటిని కాలువల ద్వారా విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కాగా ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టంతో నిండుకుండను తలపిస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.50 టీఎంసీలు) కాగా ప్రస్తుతం అదే స్థాయిలో నీరు నిల్వ ఉంది. కాగా జూన్ 1వ తేదీ నుంచి ఆదివారం వరకు ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు మొత్తంగా 279.28 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. దిగువకు 206.184 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

బిహారీ.. హమాలీలో ఉషారీ

- జిల్లాలో వేల సంఖ్యలో కూలీలు
- తీరుతున్న కూలీల కొరత

నవతెలంగాణ-లింగంపేట్

జీవనోపాధి కోసం బిహారి వాసులు రాష్ట్రాలు దాటి జిల్లాలు దాటి ఉమ్మడి జిల్లాలో పలు పనుల్లో చేరుతూ పొట్టపోషించుకుంటున్నారు. వారి రాకతో కూలీల కొరత సమస్య తీరుతుండగా.. సాగులో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. నాట్లు వేయడంతో పాటు ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనుల్లో ముందుంటున్నారు. గత పది సంవత్సరాలుగా బీహార్ రాష్ట్రం నుంచి కామారెడ్డి జిల్లాకు సుమారు 10 వేల మంది వలస వచ్చినట్టు సమాచారం. లింగంపేట్ మండలంలోని మూడు రైస్ మిల్లులలో కొనుగోలు కేంద్రంలో సుమారు 200 మందికి పైగా బీహార్ కూలీలు పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు డిసిఎంఎస్ మహిళా సంఘాలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి 410 కొనుగోలు కేంద్రాల్లో బీహార్ కూలీలే పనిచేస్తున్నారు. దీంతో జిల్లాలో హమాలీల కొరత తీరినట్టయింది.

వలస కూలీలకు జీవనోపాధి

పనులు దొరకక పొట్ట చేత పట్టుకొని వస్తున్నట్టు బీహార్ కూలీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జీవనోపాధి లభిస్తుంది. బీహార్ రాష్ట్రంలోని పాట్నా, చింతల్ మడి, ముజాపూర్, గోపాల్పూర్, బెల్ సింది, మీరాబాల్ అయ్యర్ తో పాటు తదితర గ్రామాల నుండి వలస కూలీల ఉపాధి కోసం ఊర్లు వదిలి తెలంగాణలో ప్రత్యక్షమవు తున్నారు. రోజుకు వేయి రూపాయల చొప్పున నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తున్నట్టు పలువురు బిహారి కూలీలు పేర్కొంటున్నారు.



ధాన్యం సంచులు దించుతున్న బిహారీ కార్మికులు



కుప్పగా ఉన్న ధాన్యాన్ని సంచుల్లోకి ఎత్తుతూ..



తూకం వేసిన బియ్యం లారీల్లో లోడింగ్ చేస్తూ..



రైస్‌మిల్లుల్లో అన్‌లోడింగ్ పనుల్లో సైతం బిహారీ హమాలీలు

కోతి తరమడంతో కేజీబీవీ భవనంపై నుంచి పడిన విద్యార్థిని

- తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలింపు



భవనంలోని రెండో అంతస్తు నుంచి పడ్డ విద్యార్థిని



గాయపడ్డ విద్యార్థిని

నవతెలంగాణ-ఏర్గట్ల

కోతి తరమడంతో కేజీబీవీ భవనం రెండో అంతస్తు నుంచి విద్యార్థిని ప్రమాదవశాత్తు కింద పడింది. తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన కర్రె అంజలి ఏర్గట్లలోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతుంది. ఇటీవలే తన స్వగ్రామం వెళ్ళి ఆదివారం తిరిగి వచ్చింది. రెండో అంతస్తులో తన బట్టలను ఆరేసుకునేందుకు వెళ్లగా.. ఒక్కసారిగా కోతి తరమడంతో భయాందోళనకు గురై అక్కడున్న కిటికీలోనుంచి ప్రమా దవశాత్తు కిందపడింది. గమనిం చిన కేజీబీవీ ఉపాధ్యా యులు రాలు హుటాహుటిన బాలికను అంబులెన్స్‌లో మెట్‌పల్లి మండలం మేడిపల్లి ఎముకల వైద్యశాలకు తీసుకెళ్లింది. ఎడమ చేతి విరిగిపోయి, నడుముకు, వెన్నుపూసకు తీవ్రగాయాలైనట్లు వైద్యుడు తెలిపినట్టు సమాచారం. గాయాల తీవ్రతను తెలుసుకునేందుకు స్కానింగ్ సెంటర్‌కు, ఆపై మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్టు సమాచారం. విషయం తెలియడంతో అంజలి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనై ఆస్పత్రికి వెళ్లారు.

కేజీబీవీలు, గురుకులాలు, హాస్టళ్ల వద్ద కోతుల బెడద

కాగా జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతుంది. విద్యార్థులు తమ దుస్తులను ఆరేసుకునేందుకు భవనం మీదకు వెళ్లిన క్రమంలో అక్కడే గుంపులుగా సంచరిస్తున్న కోతులు.. ఒక్కసారిగా తరిమినట్టు చేస్తుండటంతో విద్యార్థులు తీవ్ర భయందోళనకు గురవుతున్నారు. పలు చోట్ల కోతులు దాడులు సైతం చేస్తున్నాయి. పిల్లలపైకి దూకి కరుస్తూ, రక్కుతున్నాయి. దీంతో అక్కడ ఉండేందుకు వారు జంకుతున్నారు. అటు విద్యార్థులతో పాటు ఇటు సిబ్బంది, ఉపాధ్యాయులు సైతం కోతుల సంచారంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి కోతుల బెడద తీరేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణపై సీఎం నిర్ణయం కరెక్ట్ కాదని చెప్పా

- మాలల ఎదుగుదలను అణిచివేసే కుట్ర
- అన్ని రాజకీయ పార్టీలకు సత్తా చాటేలా ఐక్యత చూపాలి
- చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ వివేక్



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే, ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

'ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం కరెక్ట్ కాదు అని చెప్పా. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక మాల జాతిలో అభద్రత నెలకొంది. ఇప్పుడు మేల్కోకపోతే మాల జాతి భవిష్యత్తు అగాధంలో పడుతుంది. సొంత పనులు పక్కన పెట్టాల్సిన టైం వచ్చింది. భయం ముసుగు వీడి ధైర్యం చూపాలే. అన్ని రాజకీయ పార్టీలకు మన సత్తా అర్థమయ్యేలా ఐక్యత చాటాలే' అని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ నగరంలో మాలల ఆత్మగౌరవ సభకు హాజరై మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో మాల కమ్యూనిటీది రెండవ స్థానమని, 30 లక్షల మంది జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నారని అన్నారు. 'మాల జాతి ఐక్యతను చీల్చడానికి కుట్రలు జరుగుతున్నాయి. ఐక్యత సాధించడానికి మా నాన్న స్ఫూర్తితో బయటకు వచ్చా. ఈడి, ఇన్కమ్ టాక్స్ రైడ్లతో భయపెట్టడానికి ప్రయత్నించారు. ఉద్యమం నుంచి బయటకు వస్తే కేంద్రంలో మంత్రి పదవి ఇస్తామన్నా దేనికి లొంగలేదు. స్వరాష్ట్రాన్ని సాధించా. సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు నా ఫ్యాక్టరీ క్లోజ్ చేయించారు. నామీద ఎప్పటికీ ఎలాంటి ప్రెజర్స్ పని చేయలేవు. మా నాన్న కాకా వెంకటస్వామి బోధనలతో పెరిగిన వాడిని నష్టాలు, కష్టాలు వచ్చినా పట్టించుకునే వాడిని కాదు. ఏసీబీ దాడులు 90 శాతం మాల ఉద్యోగులపైనే జరుగుతున్నాయి' అని అవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, నాయకులు అలుక కిషన్, ఎడ్ల నాగరాజు, అమృత్, విజయ్, రామచందర్, అంగరి ప్రదీప్, ఎల్లమయ్య, స్వామి దాస్, చొక్కం దేవిదాస్, మోహన్ రావు, ఎడ్ల సంజీవయ్య, వాగ్మారే సుభాష్, సర్వయ్య, విజయ్ కుమార్, జయపాల్, సుంకరమోహన్ తదితరులు పాల్గొన్నారు.

4.2 కిలోల గంజాయి పట్టివేత



గంజాయిని,నిందితులను పట్టుకున్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ నుండి మాదవనగర్ వచ్చే మార్గంలో తనిఖీల్లో 4.2 కిలోల గంజాయిను పట్టుకున్నట్టు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ దిలీప్ టీం కంఠేశ్వర్ బైపాస్ నుండి మాధవనగర్ వచ్చే మార్గం లో తనిఖీలు చేయగా ఇద్దరు వ్యక్తులు రెండు వాహనాలలో గంజాయి తరలిస్తుండగా నిజామాబాద్ అసద్ బాబా నగర్ కి చెందిన సర్ఫరాజ్ ఖాన్ అనే వ్యక్తి ని అరెస్ట్ చేసి 2.1 కేజీల గంజాయి,పల్సర్ బైక్ ను సీజ్ చేసినట్టు తెలిపారు. ఆ వ్యక్తిని విచారించగా మహారాష్ట్ర లోని నాందేడ్ పట్టణం నుండి తీసుకొని వచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్టుతెలిపారు.

మరొక కేసులో అదే మార్గం లో ఆటో లో గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం మేరకు తనిఖీ చేయగా నిజామాబాద్ ద్వారకానగర్‌కు చెందిన సాజిత్ అలీ అనే వ్యక్తి ఆటో ను వదిలి పారిపోయాడు. ఆ ఆటో లో 2.1 కేజీల గంజాయి లభించింది. మొత్తం రెండు కేసులలో (4.2) కేజీలు గంజాయి, 1 పల్సర్ బైక్, ఒక ఆటోను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ కేసులో సర్ఫరజ్ ఖాన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ తనిఖీలలో నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ దిలీప్, ఎస్సై మల్లేష్, సిబ్బంది షబ్బీర్, ప్రభాకర్, దారి సింగ్, రవి, సంగయ్య, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి సంగమాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చాలి

- కందకుర్తిని సందర్శించిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



గోదావరికి పూజలు చేస్తున్న హర్యానా గవర్నర్

నవతెలంగాణ-రెంజల్

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమాన్ని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించి గంగమ్మ తల్లి ఒడిలో వేదమంత్రాలతో గంగా హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను హర్యాన గవర్నర్‌గా కాకుండా, తెలంగాణ బిడ్డగా గ్రామాన్ని సందర్శించినట్టు తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దుల్లోనున్న కందకుర్తి గోదావరి చారిత్రక ప్రసిద్ధి చెందిన స్థలమని, దీనిని తెలంగాణ ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ బలిరామ్ హెగ్డే వార్ బాల్యం ఇక్కడనే గడపడం వల్ల ఈ గ్రామానికి విశిష్టమైన ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. గ్రామస్తులు తమ సహాయ సహకారాలతో పెద్ద ఎత్తున స్మృతి మందిరాన్ని నిర్మించడం ఆనందదాయకమని అన్నారు. కందకుర్తి గ్రామంలో స్మృతి మందిరంతో పాటు, స్కంద మాత దేవాలయం నిర్మాణం చేపట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కందకుర్తి గ్రామంలోని పురాతన రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి, అయోధ్య మహారాజ్ సీతారాం త్యాగి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు సురేష్, గోవింద్, హనుమంతు, సతీష్, రమేష్, మేక సంతోష్, గోపికృష్ణ, ఈర్ల రాజు, గంగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, ధనుంజయ, లచ్చే వార్ నితిన్, రియాజ్, ఫుర్కాన్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం

ఎడపల్లి : బండారు దత్తాత్రేయకు నిజామాబాద్ జిల్లా జానకంపేట్ గ్రామంలోని గాంధీ చౌరస్తా కూడలి వద్ద అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణతో పాటు, పల్లె గంగారెడ్డి, స్థానిక బిజెపి నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. స్వాగతం పలికిన వారిలో ఎడపల్లి మండల భాజపా అధ్యక్షులు కోల ఇంద్రకరణ్, నాయకులు గోపాల్ భాజపా సీనియర్ నాయకులు మంద సంజు కుమార్, నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సర్వేలో వలస కార్మికులకు పాట్లు



వివరాలు నమోదు చేస్తున్న ఎన్యూమరేటర్‌లు

నవతెలంగాణ-జుక్కల్

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేతో.. వలస కార్మికులకు ఇక్కట్లు తప్పడం లేదు. సరిహద్దులో ఉన్న జుక్కల్ మండలంలోని పలువురు ఉపాధి నిమిత్తం పక్కనే ఉన్న మహారాష్ట్రతో పాటు కర్నాటక రాష్ట్రాలకు వలస వెళ్లారు. పండుగలు, ఇతరాత్ర సమయాల్లో స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటారు. అయితే ప్రస్తుతం సర్వే కొనసాగుతుండటంతో వారు రాలేక.. వారు వచ్చిన రోజు అధికారులు రాకపోవడంతో ఇబ్బందు లు ఎదురవుతున్నాయి.

ఆదివారం మండల కేంద్రంలోని భవాని తండాలో జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ ఎంపీవో రాము ఆధ్వర్యంలో కులగణన సర్వేలు క్షేత్రస్థాయి లోకి చేపట్టారు. అయితే గ్రామాలకు, గిరిజన తండాలకు వెళ్లిన అధికారులకు వలస వాదులు స్థానికంగా లేకపోవడంతో, వారంతా పొట్టకూటి కోసం గ్రామాలు వదిలి పట్టణాలలో ఉండడంతో సర్వేలకు

- పొట్టకూటి కోసం పక్క రాష్ట్రాలకు వలస

వెళ్లిన అధికారులకు వివరాలు చెప్పేవారు లేకుండా పోతు న్నారు. గ్రామాలలో గిరిజన తండాలలో పరిశీలనకు వెళ్లిన అధికారులకు ఇంటికి తాళాలు వేసి ఉండడంతో అక్కడ సమాధానం చెప్పేవారు లేకపోతున్నారు. సర్వే విషయాల గురించి పట్టణాలలో ఉంటున్న వలస వెళ్లిన వారికి ఎటువంటి సమాచారం లేకపోవడంతో వారు నివాస పత్రాలు ఇక్కడ ఉన్న పనులు మాత్రం అక్కడ నిర్వహి స్తూడంతో వివరాలు నమోదు చేయించుకోలేక పోతున్నారు. వారి కోసం ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి ఇతర రాష్ట్రాల్లోకి వలస వెళ్లిన వారిని పిలిపించి వారి వివరాలు నమోదు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ముషాయిరాను ఆదరించాలి

- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ముషాయిరా సంస్కృతి(కవి సమ్మేళనం) రోజు రోజుకు క్షీణిస్తుందని, దాన్ని ఆదరించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. పట్టణంలోని ఎన్నారై కాలనీలో జరిగిన ముషాయిరా లో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజుల్లో ఉత్పత్తి చేయబడిన కవిత్వం మునపటి కంటే సరళంగా ఉంది. కానీ అది ఇప్పుడు ముషాయిరా లకు రచించిన కవిత్వ పుస్తకాలకు ప్రోత్సాహం లేదని, ఈ రోజుల్లో ముషాయిరా కార్యక్రమం నడుస్తుంటే హాళ్లు నిండడం లేదని, కవులు కూడా వారి సరళమైన రచనల కోసం గుర్తుంచుకోబడతారని అన్నారు. కవి ఇక్బాల్ భారతదేశ స్వాతంత్ర్య పోరాటం చివరి దశలో ప్రజాదరణ పొందాడదని, తన కఠినమైన ఉర్దూ పద్యాలకు కాదు, సరళమైన సారే జహాన్ సే అచ్చా, హిందుస్థాన్ హమారాతో ప్రసిద్ధి చెందాడని తెలిపారు. ముషాయిరాలో కూర్చుంటే సమయం కూడా ఏర్పడదని, మనసుకి ఎంతో ప్రశాంతత దొరుకుతుందని, ఉల్లాసంగా ఉంటుందని అన్నారు. రాజకీయ నాయకులకు వారి ముందే వారిని నవ్వుతూ కవిత్వంలో విమర్శించే ఆయుధమే ముషాయిరా అని, ముషాయిరా ద్వారా బడుగు బలహీన వర్గాల సమస్యలు వారి జీవన విధానం కళ్ళ కు కట్టినట్టుగా కవులు వినిపిస్తారని తెలిపారు. ఇవి ప్రజలను సంఘటితం చేస్తాయని, దీంతో ప్రభుత్వాలు కూడా కూలుతాయని, ఉద్యమాలకు ఊపిరి ఊదుతాయని చెప్పారు. ముషాయరాలు కొనసాగాలని, కవులను సన్మానించాలని, ప్రోత్సహించాలని అన్నారు.



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

బెంచీలు మోయిస్తుంది.. బూతులు తిడుతుంది

- ప్రిన్సిపల్ ఉంటే హాస్టల్లో ఉండబోం
- కేజీబీవీ విద్యార్థినుల నిరసన
- ఆమె అండతో అటెండర్‌లు, సిబ్బంది సైతం దురుసుగా ప్రవర్తిస్తున్నట్టు ఆవేదన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మంగ

నవతెలంగాణ-బీబీపేట్

'ప్రిన్సిపాల్ అసభ్యకరమైన పదజాలంతో బూతులు తిడుతున్నారు. బెంచీలు మోయిస్తుంది. ఆమె అండతో అటెండర్‌లు సైతం ప్రిన్సిపాల్ లాగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది సైతం దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ప్రిన్సిపల్ ఉంటే హాస్టల్‌లో ఉండబోమని' విద్యార్థులు వాపోయారు. బీబీపేట్ మండల కేంద్రంలో గల కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆదివారం ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలు పాఠశాల బయట నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ మంగ తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. హాస్టల్లో సరియైన పద్ధతిలో భోజనాలు వండటం లేదని, ఆయా సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులను నియమించలేదని తద్వారా తరగతులు జరగలేక సిలబస్ మిస్ అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పైశాచికత్వాన్ని పొందుతున్న హాస్టల్ ప్రిన్సిపాల్ విధులలో ఉన్నంతవరకు తాము హాస్టల్ లోకి రామని విద్యార్థులు పట్టుబట్టారు. హాస్టల్ కిందిస్థాయి సిబ్బంది సైతం చేతులపై సాంబారు పోస్తూ పైశాచికత్వం ప్రదర్శిస్తున్నారని విద్యార్థులు కన్నీరు మున్నీరు అయ్యారు. ఇటీవల జిల్లా స్థాయి అధికారి కేజీబీవీని విజిట్ చేసి సమస్యలు అడిగితే చెప్పినందుకు ప్రిన్సిపల్ తర్వాత రోజు ఉదయం ప్రార్థన విభాగంలో విద్యార్థులను అమర్యాదగా పిలిచి బెదిరింపులకు గురిచేసిందని భయపెడు తోందని వాపోయారు. వీరి ఆందోళన సమాచారం అందుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించారు. మరో ప్రిన్సిపల్‌ను పంపాలని ఉన్నతాధికారులకు విన్నవిస్తామని నాయకులు తెలిపారు.

నగరంలో మహిళా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్



మాట్లాడుతున్న విగ్నేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలో మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నగర కమిటీ సమావేశం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీపిక, విగ్నేష్ మాట్లాడుతూ.. నగరంలో మహిళా డిగ్రీ కళాశాలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కళాశాలలో ఒకేషనల్ కోర్సులో చదువుతున్న విద్యార్థులకు అకాడమిక్ ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్న పాఠ్యపుస్తకాలు అందించకపోవడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లను అధికారులు సందర్శించి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. మధ్యాహ్న భోజన స్కీం ని ఇంటర్ మీడియట్ కళాశాలలో ప్రవేశపెట్టాలని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థుల ఉద్యమానికి ప్రభుత్వం తలవంచక తప్పదని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు దినేష్, చక్రి, అజాద్, వీణ, హర్షిత, ప్రణయ్, అనిల్, నాగరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | నవంబర్ 11, 2024 | www.navatelangana.com

పెర్కిట్‌లో ఘనంగా భీమన్న ఉత్సవాలు



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పట్టణ కేంద్ర పరిధిలో గల పెర్కిట్‌లో ఆదివారం భీమన్న ఉత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం ప్రతినిధులు భీమన్న గదలకు గంగా స్నానం చేయించి ఊరేగింపు నిర్వహించారు. సోమవారం భీమన్న కళ్యాణోత్సవం, యజ్ఞం, అగ్నిగుండం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో ఆదివాసి నాయక్ పోడు సేవా సంఘం ప్రతినిధులు మూడ అశోక్, మూడ భాస్కర్, మూడ గంగాధర్, కంచు పెద్ద ముత్తెన్న, పెద్దోళ్ల చిన్న గంగారం, సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో ఆదివారం కమ్మర్ పల్లి వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా అబ్దుల్ అజరుద్దీన్, ఉపాధ్యక్షుడు అల్గొట్ రంజిత్ కుమార్, కార్యదర్శి వంశీ, సలహాదారుగా డి. బాల్ కుమార్, మెంటర్ గా కార్తీక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో వాలీబాల్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. గ్రామంలోని యువతను, విద్యార్థులను వాలీబాల్ క్రీడలో తీర్చిదిద్దేందుకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన క్రీడాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ షాప్ ప్రారంభం



రేషన్‌షాపును ప్రారంభిస్తున్న మండల అధ్యక్షులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానాకుర్ది గ్రామంలో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, బోర్గం(పి) మాజీ విండో అధ్యక్షుడు సూర్య రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం లాగా దాచుకోవడం, దోచుకోవడం తెలియదని ప్రజా సంక్షేమం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి నిరంతరం ఆలోచిస్తారని వారు తెలిపారు. ఎవనున్న రోజుల్లో రేషన్ షాప్‌ల ద్వారా సన్నబియ్యం అందిస్తామని అన్నారు. ఇక్కడ రోడ్డు, చెక్ డ్యాం సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలో నిధులు మంజూరయ్యే విధంగా చూస్తామని వారు తెలిపారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా నిరుపేదలకు అందించారన్నారు. కచ్చితంగా పేదలందరూ సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ఉపయోగించుకోవాలని నిధులు కూడా త్వరగా మంజూరు అవుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, రాజారెడ్డి, సాయికుమార్, ప్రభాకర్, రేషన్ డీలర్ సవిత, గంగారెడ్డి, నాగార్జున్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు

యూఎస్‌ఎఫ్ఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

యూఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని యుఎస్ఎఫ్ఐ హాస్టల్ యూనిట్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగర కేంద్రంలో గల స్కూల్ హాస్టల్‌లో యుఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా మహాసభల కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ యూనిట్ కమిటీ కార్యదర్శి బాబురావు మాట్లాడుతూ.. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ వ్యవస్థాపక అఖిల భారత మహాసభలు 2024 డిసెంబర్ 14, 15 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ కేంద్రంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం 1984లో ఉస్మానియా యూనివర్సిటీలో ఏర్పడిందని, అందరికీ సమాన విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. కొఠారి కమిషన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో 10శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ లో 30శాతం నిధులు కేటాయించాలని ఉన్న ఇప్పటి వరకు కనీసం సగం కూడా కేటాయించలేని దుస్థితిలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. ప్రయివేటు,కార్పొరేటు విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ఇంకో వైపు ప్రభుత్వ విద్యాసంస్థలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. ఈ మహాసభల్లో ప్రస్తుత విద్యారంగ పరిస్థితిపై చర్చించి, భవిష్యత్తు ఉద్యమాల రూపకల్పన చేసుకొని నూతన అఖిల భారత కమిటీని ఎన్నుకోవటం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో హాస్టల్ యూనిట్ కమిటీ సభ్యులు పోశెట్టి, హరి ప్రసాద్, వంశి, రోహిత్, సాయిప్రసాద్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-మాక్లూర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చిక్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మోరా గ్రామానికి చెందిన బట్టు శ్రీకాంత్ (28) ఓ ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వహించుకుని తిరిగి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. చిక్లి గ్రామ సమీపంలో తనకు తాను మోటర్ సైకిల్ పై నుండి పడి మృతి చెందాడు. మృతుని తండ్రి బట్టు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

మేరు సంఘ అభివృద్ధికి కృషి చేస్తా

- పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల మేరు సంఘం భవన పున: ప్రారంభానికి నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వివిధ తర్పల సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల కార్యవర్గాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిజామాబాద్ మేరు సంఘం అంటేనే ఐక్యమత్యానికి మారు పేరని, సంఘ పెద్దలతో ముప్పై ఏళ్ల అనుబంధం ఉందని అన్నారు. భవనాన్ని నిర్మించి భావి తరాలకు ఇవ్వడం మేరు కులస్తులు అందరు గర్వించదగ్గ విషయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన ద్వారా చేతి వృత్తుల, కుల వృత్తులను ప్రోత్సాహించడం జరుగుతుందని అన్నారు. మేరు సంఘ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యేకి మేరు సంఘం పెద్దలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గడుగు రోహిత్, మేరు సంఘ కుల పెద్దలు, మేరు సంఘం జిల్లా అధ్యక్షులు సోమ హనుమంత్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు గంగ కిషన్, కొట్టురు దేవి దాస్, జిల్లా కో శాధికారి చంద్రకాంత్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సేవల్లో.. వ్యవసాయ మార్కెట్ కమిటీలు

- త్వరలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-ఆర్మూర్

2016లో రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు చైర్‌పర్సన్ స్థానాలను కేటాయిస్తూ మొదటిసారిగా రిజర్వేషన్ పద్ధతిని ప్రారంభించింది. ఐదు పర్యాయాలు చైర్‌పర్సన్ పీఠానికి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. కాగా ఈ ఉత్తర్వుల ఆధారంగా గత ప్రభుత్వం నాయకులను మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాలకు నామినేట్ చేశారు . గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న చైర్‌పర్సన్లు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుంటూ తమ పదవీ కాలాన్ని విడతల వారీగా పెంచుకుంటూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల తర్వాత జిల్లాలోని మార్కెట్ కమిటీల పాలకవర్గాన్ని ప్రకటించి జిల్లా కేంద్రంతో పాటు బోధన్, వర్ని, కమ్మర్‌పల్లి, కోటగిరి, వేల్పూర్ ఏఎంసీ పాలకవర్గాల ప్రమాణస్వీకారాలు జరిగాయి.

కాగా ఆర్మూర్ పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్‌గా ఇట్టెం జీవన్‌తో పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి సిద్ధమవుతుంది.. మార్కెట్ కమిటీ కార్యాలయంలో చిన్నచిన్న మరమ్మతు పనుల్లో భాగంగా పెయింటింగ్ వేస్తూ తుది మెరుగులు దిద్దుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లను ప్రవేశ పెట్టగా, రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్లలో ఒక్కటైనా జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం తీవ్ర పోటీ కొనసాగి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, వైస్ చైర్మన్‌గా జంగిటి రామచందర్ నియమితులయ్యారు.



25 కోట్ల ఆదాయంతో...

2017 జూలై నుండి 2019 జనవరి వరకు ఏడాదిన్నర కాలం పాటు దివ్య దినేష్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించగా, వీరికి ముందు మూడు సంవత్సరాలు పర్సన్ ఇన్చార్జి పాలన నడిచింది. 2019 జనవరి తో పాలకవర్గం గడువు ముగిసిన తర్వాత గత కేసీఆర్ ప్రభుత్వం పర్సన్ ఇన్చార్జిని నియమించింది. జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో అర్బన్ రూరల్‌లతోపాటు బోధన్, ఆర్మూర్ నియోజక వర్గాల్లోని 10 మండలాల్లో విస్తరించి ఉంది. పాలకవర్గం ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వంతో పాటు నాలుగు నియోజకవ ర్గాలకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జిలను సమన్వయం చేసుకొని చైర్మన్ సభ్యులను ఎంపిక చేశారు. ఈ మార్కెట్ యార్డులో పసుపు, ఉల్లిగడ్డ, అమ్చూర్, మొక్కజొన్న, సోయా, వరి, పెసర్లు, కందులు, కూరగాయలు ఇతర అన్ని రకాల పంటల క్రయవిక్రయాలు జరుగుతాయి. మార్కెట్ కమిటీకి సంవత్సరానికి సుమారుగా 25 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది.

కౌన్సిలర్ నుండి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా...

జిల్లాలోని బోధన్ పట్టణంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అంకు దామోదర్ సతీమణి అంకు సంధ్య 26వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతూ ఏఎంసి చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.


బాల్కొండ నియోజకవర్గంలో...

మార్కెట్ కమిటీ పాలకవర్గాలను నియమిస్తున్న ప్రభుత్వం వేల్పూర్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీలను సెప్టెంబర్ 21న ప్రకటించింది. వేల్పూర్ ఏఎంసీ చైర్మన్‌గా మెండోరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్‌గా వేల్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమ్మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని నాగపూర్ మాజీ సర్పంచ్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్‌గా కమ్మర్పల్లి మాజీ ఉపసర్పంచ్ సుంకెట బుచ్చన్న నియమితులయ్యారు.

త్వరలో ఆర్మూర్ ఏఎంసీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారం...

పట్టణానికి చెందిన సాయిబాబా గౌడ్ ఏఎంసి చైర్మన్‌గా, మండలంలోని ఇస్సపల్లి గ్రామానికి చెందిన ఇట్టెం జీవన్ వైస్ చైర్మన్‌గా పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి సిద్ధమవుతుంది. జిల్లా మార్కెటింగ్ అధికారి, అగ్రికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్‌లతో ఆలూరు జక్రాన్‌పల్లి, ఆర్మూర్ పట్టణంలో విలీన గ్రామాల నుండి డైరెక్టర్లుగా చిన్న గంగారం(చేపూర్,) ఉషన్న(మచ్చర్ల), అజ్మీర్ పీర్ సింగ్ (గున్యాతాండ), కనక రవికుమార్ (తొర్లికొండ), అమృతరావ్ (అంకాపూర్), ఎం.చంద్రశేఖర్ రెడ్డి (పెర్కిట్ కొటార్మూర్) పట్టణానికి చెందిన సయ్యద్ ఫయాజ్, కళ్లెం మల్లారెడ్డి, పింజ ఉషారాణి, మల్లేష్ మంతిని, వీరితోపాటు మమ్మద్ మునీరుద్దీన్, ముత్యం సంతోష్, పెర్కిట్ చైర్మన్లు పాలకవర్గంలో ఉండనున్నారు.

రైతన్నల సంక్షేమానికి కృషి



పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి
కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి, ఆర్మూర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతన్నల సంక్షేమానికి , మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ సమిష్టి కృషితో నియోజకవర్గ అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తాం.

రైతులకు సేవలు అందిస్తాం..



సాయిబాబా గౌడ్.
ఏఎంసీ చైర్మన్, ఆర్మూర్

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించిన పెద్దలకు ధన్యవాదాలు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతుల శ్రేయస్సుకు కృషి చేస్తా.

రైతులు తొందరపడి దళారులకు అమ్ముకోవద్దు

- వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతులు ఎవరు తొందరపడి ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి అన్నారు. ఆదివారం వేల్పూర్ మండలంలోని పచ్చల నడుకుడ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని, కొనుగోలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రం వద్ద సౌకర్యాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి మాట్లాడుతూ.. రైతుల సౌకర్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం విరివిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తుందన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు పండించిన సన్న వడ్లకు క్వింటాలుకు రూ.5 వందలు బోనస్ చెల్లిస్తుందన్నారు. రైతులెవ్వరు తొందరపడి ఎంతో కష్టపడి పండించిన తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని కోరారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లింబారెడ్డి, డైరెక్టర్ నర్సారెడ్డి, టక్కరి గంగాధర్, గుడాల మోహన్, లింగేశ్వర్, వాడి మాజీ సర్పంచ్ మహేష్, రఘు, భోజందర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలును పరిశీలిస్తున్న వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి

డొంకల్‌లో ఉపాధి హామీ గ్రామ సభ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని డొంకల్ గ్రామంలో ఆదివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో ఏడాది పాటు చేసిన పనులకు సంబంధించి గ్రామ సభను ఏర్పాటు చేశారు. 1 ఎప్రిల్ 2023 నుండి 31 మర్చ్ 2024 లో చేసిన పనులకు సామాజిక తనిఖీ మూడవ విడతలో భాగంగా మూడు రోజులుగా సామాజిక బృందం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించింది. పనుల్లో జరిగిన లోటుపాట్లను గ్రామ సభలో గ్రామస్తులకు వివరించారు. సమావేశం లో ఇందల్ వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి, గ్రామ ప్రత్యేక అధికారి రవి మోహన్ భట్, ఎపిఓ ఒడ్డెం పోశెట్టి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవత సదన్‌కు బోర్ మోటార్, పంప్ పైప్ అందజేత



బోరుమోటరు, పంప్‌పైపు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండల కేంద్రంలోని మానవత సదన్‌లో ప్రస్తుతం 150 మంది పిల్లలు ఆవాసం ఉంటున్నారు. ఆదివారం సదన్‌లోని సబ్‌మెర్సిబుల్ బోర్ పంప్, మోటార్ కాలిపోయింది. ఈ విషయం రోటరీ క్లబ్ నిజామాబాద్ మానవత సదన్ జాయింట్ సెక్రటరీ సుధాకర్ రావుకు తెపారు. వెంటనే క్లబ్ అధ్యక్షులు విజయ్ రావు, బాబూరావు, సతీష్‌షా, జ్ఞాన ప్రకాష్ , సిఎంఓ శ్రీనివాస్ రావు, గురు ప్రీత్ సింగ్ పిల్లలకు నీటి ఇబ్బంది కలుగుతుందని తెలుసుకున్నారు. వెంటనే నిజామాబాద్ మిషన్ -1000 ద్వారా రోటరీ క్లబ్ నిజామాబాద్ వారు 28వేల రూపాయల విలువ గల మోటర్ ను అర్షాద్ మెకానిక్ డిచ్ పల్లిద్వారా ఫిట్టింగ్ చేయించారు. రోటరీ క్లబ్ నిజామాబాద్ అధ్యక్షులు విజయ రావు మాట్లాడుతూ.. ౨ మానవత సదన్ ప్రారంభించిన 2016 నుండి అండగా ఉంటున్నామని, ఇక్కడ బతుకమ్మ వేడుకలు కూడా గొప్పగా జరుపుకున్నామని , పిల్లలు అందరూ బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి సదన్ కు మంచి పేరు తీసుకొని రావాలని అన్నారు. మానవత సదన్ పిల్లల కు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. మానవత్వం చాటిన రోటరీ క్లబ్ నిజామాబాద్ కు మానవత సదన్ పిల్లలు, లైజన్ ఆఫీసర్ సుధాకర్ రావు, కేర్ టేకర్ అందే రమేష్, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం జిల్లా సమగ్ర శిక్ష నిజామాబాద్ అధికారులకు సమాచారాన్ని అందజేశారు.

మంచి కార్యక్రమాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఇందూరు యువత మనశ్శాంతి కోవెల ఆశ్రమ నిర్మాణానికి సహకారం అందిస్తాం
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

మంచి కార్యక్రమాలకి తమ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని ఇందూరు యువత మనశ్శాంతి కోవెల ఆశ్రమం నిర్మాణానికి త్వరలో సహకారం అందిస్తామని, మానవసేవే మాధవసేవ అని నిరూపిస్తున్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం రాత్రి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సందర్శించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తమ ప్రభుత్వం తోడుగా నిలుస్తుందని, 13 ఏండ్లుగా నిర్విరామంగా ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందూరు యువత మనశ్శాంతి కోవెల ఆశ్రమ నిర్మాణానికి కృషి చేస్తామని, అందుకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇందూరు యువత అందరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అలాగే నుడా చైర్మన్ కేశవేణు మాట్లాడుతూ..సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భాగస్వామ్యం కావలని అన్నారు. ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ మాట్లాడుతూ.. మానవత్వంతో ఇందూరు యువత చేసే కార్యక్రమాలు గొప్పవని కొనియాడారు. అనంతరం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు మద్దుకూరి సాయిబాబు తమ సంస్థ నిర్వహించే కార్యక్రమాలను సభకు వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఫ్లోర్ లీడర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్‌ను భారతీయ జనతాపార్టీ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి పార్టీ కార్పొరేటర్లతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు వారు శుభాకాంక్షలు తెలిపారు. తమ డివిజన్‌ల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ప్రతి డివిజన్‌కు రూ.25లక్షల చొప్పున నిధులు కేటాయించాలని, తాత్కాలికంగా 25చొప్పున వీధి దీపాలు అందజేయాలని, కౌన్సిల్ సమావేశాన్ని త్వరగా నిర్వహించాలని కోరారు. స్రవంతి రెడ్డి వెంట డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు, కార్పొరేటర్ పంచ రెడ్డి ప్రవళిక, భాజపా నాయకులు ఇప్పకాయల కిషోర్, పంచ రెడ్డి శ్రీధర్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఫ్లోర్ లీడర్లు

కొత్త ఓటర్లకు.. ఓటుహక్కు ప్రాధాన్యత తెలపాలి

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండలంలోని ఉప్లూర్ లో ఆదివారం ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన బూత్ ల వివరాలను ప్రత్యేక ఓటర్ నమోదుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు కొత్త ఓటర్ నమోదు కోసం, మార్పులు చేర్పుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బూత్ లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండినటువంటి ఓటరు ఎవరైనా ఉంటే వారికి వారి ఓటు హక్కు ప్రాధాన్యత గురుంచి అవగాహన కల్పించి, వారితో ఫారం నెంబర్-6 దరఖాస్తు చేయించాలన్నారు. కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునే వారి కోసం ఫారం నెంబర్-6, ఓటర్ కార్డులో ఏదైనా తప్పులు దొర్లితే దాన్ని సరిదిద్దుకునేందుకు ఫారం నెంబర్-8, ఎవరైనా మరణించిన, శాశ్వతంగా షిఫ్టు అయిన వారి కోసం ఫారం-7ని అప్లై చేయించాలని సూచించారు. ఏ రోజు దరఖాస్తులను ఆ రోజే ఆన్ లైన్ చేయాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు శోభ, బాజే సాబ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

ఊట్‌పల్లి చెరువును పరిశీలించిన ఇరిగేషన్ డీఈఈ



నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలోని ఊరచెరువు అలుగు తూమును ఇరిగేషన్ డీఈఈ లోక్యనాయక్ ఆదివారం పరిశీలించారు. అలుగు తూము నుంచి సాగునీరు వృథా కాకుండా రెండు రోజుల్లో మరమ్మతు పనులు చేపడతామని డీఈఈ లోక్యనాయక్ తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టప్పా సాయిలు, కాంగ్రెస్ నాయకులు సాయిరెడ్డి, బల్లేపు నర్సయ్య, జమీల్, సూరి, రైతులు కొత్తింటి సాయిలు, దండు సాయిలున్నారు.

వచ్చే ఐదు నెలల్లో నియోజకవర్గానికి ఐదు కోట్లు

- ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఐదు నెలల్లో ఉపాధి హామీ ద్వారా ప్రతి నియోజకవర్గానికి ఐదు కోట్లు కేటాయించనుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు తెలిపారు. ఈ నిధుల ద్వారా వ్యవసాయ అభివృద్ధి పనులు, మహిళా సంఘాలకు చేయూత, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చు చేయనున్నట్టు వివరించారు. అదేవిధంగా మహిళల ఆదాయం పెంపు కోసం ప్రతి నియోజకవర్గానికి కోటి కేటాయింపు, 2,700 ఎకరాల్లో ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలు, ఈతమొక్కల పెంపకం, జల నిధి కింద 204 కోట్లతో 11,350 నీటినిల్వ సంరక్షణ పనులు, అలాగే 106 కోట్లతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చేపట్టబోతుందని జుక్కల్ ఎమ్మెల్యే తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి



రెంజల్ : సర్వేను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెంజల్/బోధన్

తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలు, అధికారులకు సహకరించి ఆర్థిక సామాజిక, రాజకీయ లబ్ది పొందాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే చేస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించి 75 అంశాలకు సంబంధించిన ప్రతీది క్షుణ్ణంగా సిబ్బందికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంకరెడ్డి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, మోహన్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సగ్గు వెంకటి, సల్మాన్ ఖాన్, వేణు, ఇందిరారెడ్డి, సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి..

బోధన్ : ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఇందూర్ హైస్కూల్‌లో ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో విద్యావ్యవస్థపై పలు అంశాలపై ఆయన చర్చించారు. బోధన్ ప్రాంతం గతంలో విద్యా హబ్‌గా మంచి పేరు ఉండేదని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో గత పాలకులు విద్యపై నిర్లక్ష్యం వహించారని, దీంతో విద్యావ్యవస్థ గాడి తప్పిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే విద్యావ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ప్రణాళికా బద్దంగా ముందుకు సాగుతుందని అన్నారు. బోధన్ ప్రాంతంలో మంచి విద్య అందుతుందని దూర ప్రాంతాల నుంచి చదువుకునేందుకు విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారని వారి నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచించారు. వారికి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. నియోజకవర్గం అభివృద్ధిని తనకు వదిలేయాలని, విద్యా ప్రమాణాలు విషయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గానికి రాష్ట్రంలోనే మంచిపేరు వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ పద్మ, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిశోర్, బోధన్ అధ్యక్షులు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజు, సత్యనారాయణ, దిగంబర్‌రావు, కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ ఫామ్‌ను తొలగించాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు..

బోధన్ పట్టణంలోని జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన డెయిరీ ఫామ్‌ను తొలగించాలని కోరుతూ ఆదివారం ఆచన్‌పల్లి వాసులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీ రామ కాలనీలో ఏర్పాటు చేసిన డెయిరీ ఫామ్ వలన దోమలు వ్యాపించి ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికుల ఎమ్మెల్యేకు వివరించారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని వాపోయారు. డెయిరీ ఫామ్ మరోచోట ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులను ఆదేశించాలని కోరారు.

నారు మడులు సిద్ధం



ఎడపల్లి శివారులో సాగుచేసిన నారుమడి

నవతెలంగాణ-ఎడపల్లి

వానాకాలం పంటలు చేతికిరావడంతో యాసంగి పంటలు సాగుచేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఎడపల్లి మండలంలోని బోరు బావులున్న పలు గ్రామాల రైతులు యాసంగి వరి నాటు కోసం వరి నారుమడులను సిద్ధం చేశారు.

మహిళా కాంగ్రెస్ మండలాధ్యక్షురాలుగా స్వప్న ఏకగ్రీవంగా ఎన్నిక



ఎన్నికైన మహిళా కాంగ్రెస్ మండల కమిటీ

నవతెలంగాణ-లింగంపేట్

మహిళా కాంగ్రెస్ మండలాధ్యక్షురాలుగా లింగంపేట్ గ్రామానికి చెందిన శీలమంతుల స్వప్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు అరుణ, లింగంపేట్ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలుగా మన్నె లక్ష్మి, అడ్డి శోభ, సెక్రెటరీ పోచబోయిన కవిత, కేతావత్ లావణ్య కార్యవర్గ సభ్యులు వడ్ల పద్మ, బెస్త పవిత్ర, కంది సాయవ్వ, బండ ఎల్లవ్వ, కాట్రోత్ అంగూరితో పాటు సలహాదారులుగా ఎన్నుకున్నారు. గ్రామగ్రామాన మహిళా కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేయాలని వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, మండల నాయకులు వంజరి ఎల్లమయ్య, దురిశెట్టి అశోక్, ప్రసాద్ గౌడ్, రవి, నాగరాజు, సుప్పల రాజు, నగేష్, బైరయ్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



జుక్కల్ : షేట్‌కార్ గంగాధర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజాంసాగర్/జుక్కల్

నిజాంసాగర్ మాజీ సర్పంచ్ బేగారిరాజు మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాక విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ఆదివారం రాజు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు నిజాంసాగర్ మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, అచ్చంపేట సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచులు రమేష్ గౌడ్, అంజయ్య, మాజీ ఏఎంసి ఉపాధ్యక్షులు గైని విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అనారోగ్యానికి గురి కావడంతో మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే బాధితుల ఇంటికి వెళ్లి ఆదివారం పరామర్శించారు. కార్యకర్త షెట్‌కార్ గంగాధర్ హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో ఇటీవలే ఆరోగ్య సమస్యలతో చేరి చికిత్స పొందడంతో ఆయన మహారాష్ట్రలోని దెగ్లూర్‌లో నివాసముంటున్న నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా తాము ఎల్లప్పుడూ ఉంటామని సమస్యలు ఏవైనా ఉంటే తాము వెంటనే స్పందించి వారికి పార్టీపరంగా ఆదుకుంటామని హామీనిచ్చారు. ఆయన వెంట జుక్కల్ మాజీ సర్పంచ్ బొల్లి గంగాధర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నీలు పటేల్, పడంపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు నాయకుడు పావుడే బస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ

నవతెలంగాణ-కామారెడ్డి

హామీల అమలులో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ విమర్శించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కామారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పశ్య పద్మ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించి, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రస్తుతం ఏర్పడ్డ ప్రభుత్వం సంవత్సరం గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటగా రేషన్ కార్డులు నిరుపేదలకు పంపిణీ చేయాలని, రేషన్ కార్డు లేక నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతన పెన్షన్లను వెంటనే ఇవ్వాలని, పెంచిన నిత్యావసర ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జిల్లాలో ప్రతి గ్రామంలో ఎర్రజెండా ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. అనంతరం నల్లగొండలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని భారీ బహిరంగ సభ లక్షలాది మందితో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు పి.బాలరాజ్, దుబాస్ రాములు, జిల్లా నాయకులు దేవయ్య, ఈశ్వర్, మల్లేష్, రాజమణి, పుష్పలత, శ్యామల, శంకర్, హనుమాన్లు, కృష్ణ, సాయిలు, జంపయ్య, రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకులు జంపయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశ్య పద్మ

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి..

తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పరిషత్ పద్మ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్‌లో డాటా ఎంట్రీలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఉద్యోగులకు, హమా లీలకు అందులో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రాష్ట్రంలో సివిల్ సప్లైలో హమాలీలుగా డాటా ఎంట్రా ఆపరేటర్‌గా కిందిస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులు 90 శాతం పైబడిన నిరుపేదలకు రేషన్ బియ్యాన్ని అందిం చడంలో తొమ్మిది, పది గంటలు పనిచేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి పనిభారం తగ్గించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. అనంతరం కామారెడ్డి ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పి.బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.దశరథ్, దుబాస్ రాములు తదితరులు మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సివిల్ సప్లైలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డాటా ఎంట్రీ ఉద్యోగులు ఎం.శ్రీకాంత్, పి.సాయికుమార్, వై.భవన్ సాయి, వి.రమణారెడ్డి, జె.శ్రీకాంత్, బి.కాంతంరెడ్డి, ఎం.కృష్ణ, బి.ప్రసాద్, తేజ, కె.శివరాజ్, జి.నిఖిల్‌గౌడ్, కె.సతీష్, జె.దయానంద్, ఎస్.ప్రదీప్ కుమార్, డి.రాజేశ్వర్, జి.రజిత, పి.బాలరాజు. ఎ.విశాల్ తోట, సతీష్, ఎన్.నాగేష్ నాయక్, ఎం.రమేష్, బి.శ్రీనివాస్, సి.శ్రీకాంత్‌రెడ్డి, పి.దేవరాజ్ గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించిన మాజీ జెడ్పిటిసి



కొలతలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామాన్ని మాజీ జెడ్పిటిసి ఉషా గౌడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు గ్రామంలో అవసరమున్న చోట సిసి రోడ్ల నిర్మాణానికి రోడ్ల మార్గాలు, స్థలాలు పరిశీలించి కొలతలు నిర్వహించారు. వర్షాకాలంలో రోడ్లు బురదమయం కాకుండా గ్రామాలలో సిసి రోడ్లు వేయించడానికి స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు, మాజీ సర్పంచ్ రవీందర్, మత్తమాల సొసైటీ వైస్ చైర్మన్ పద్మారావు, సొసైటీ మాజీ డైరెక్టర్ శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగారం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులుగా వెంకటి

- మైనార్టీ గ్రామ అధ్యక్షులుగా ఎస్‌కే రజాక్



ఎన్నికైన నూతన కమిటీ అధ్యక్షులు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా సగ్గు వెంకటి, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా ఎస్‌కే రజాక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మాజీ జడ్పిటిసి నాగభూషణం రెడ్డి తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నట్టు వివరించారు. ఉపాధ్యక్షులుగా సమ్మి, గైని సాయిలు, ప్రధాన కార్యదర్శిగా చందూర్ సాయన్న, కార్యదర్శులుగా కొత్వాల్ శ్రీనివాస్, దగ్గుల శ్రీకాంత్, ఎం.సాయగౌడ్‌ను ఎన్నుకున్నారు. అలాగే మైనార్టీ సెల్ అధ్యక్షులుగా ఎస్‌కే రజాక్, ఉపాధ్యక్షులుగా ఆటో అజీమ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె అహమ్మద్, కార్యదర్శులుగా ఎస్కే అబ్బాస్, మీర్జా అబ్రహార్, ఎస్.కె ఎజాస్, ఎస్‌కే గౌస్‌ను, కార్యవర్గ సభ్యులుగా ఆర్.సాయిరెడ్డి, (బాబు ఖాన్) సుంచు లింగం, చాకలి నరేందర్, అప్సర్, లసింగారి పోశెట్టిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్ కుమార్, సల్మాన్ ఖాన్, షబ్బీర్, వేణు, ఇందిరారెడ్డి, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పేరుతో సైబర్ నేరగాళ్ల వల

- అప్రమత్తంగా ఉండండి
- ఎస్ఐ సుధాకర్

నవతెలంగాణ-నిజాంసాగర్

సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సైబర్ నేరగాళ్లఫోన్లకు లింకులను పంపి డబ్బులు కొట్టేసే అవకాశం ఉందని నిజాంసాగర్ ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆది వారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రజ లందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వే కేవలం ఇంటి దగ్గరకు వచ్చి మాత్రమే అధికారులు సర్వే చేస్తారని ఆయన తెలిపా రు. ఆన్లైన్లో ఎలాంటి సర్వేను నిర్వహించబోరని ఆయన అన్నారు.

కావున సమగ్ర కుటుంబ సర్వే పేరుతో వచ్చిన లింకులపై ఎవరు కూడా క్లిక్ చేయొ ద్దని, ఓటిపి గానీ వ్యక్తిగత సమాచారం గానీ ఫోన్లో ఎవరికీ చెప్పొద్దని ఆయన తెలిపారు. ఏదైనా నేరానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930కి ఫోన్‌చేసి చెప్పాలని ఆయన సూచించారు.



ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోండి



ఓటర్ నమోదు పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని నసురుల్లాబాద్ తహసీల్దార్ భావయ్య తెలిపారు. ఆదివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా నసురుల్లాబాద్ గ్రామాల్లో 146, 147 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్ జాబితాను, ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా చనిపోయిన వారు ఉంటే ఫారం-7, కొత్త, మార్పులు చేర్పులకు దరఖాస్తులు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారి రతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతం

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్కిడ్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతమైనట్టు పాఠశాల యాజమాన్యం ఆదివారం తెలిపింది. ఈ ప్రోగ్రాంలో అధ్యాపకులకు ఆధునిక బోధనా పద్ధతులు, పెడగోగికల్ నైపుణ్యాలను విద్యపై ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌లో పేరుగాంచిన నిపుణులు వజ్జ మహేందర్, వజ్జ నవనీత అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో ఇంటరాక్టివ్ క్లాస్‌రూమ్ మేనేజ్‌మెంట్, డిజిటల్ టూల్స్ వాడకం, ఆధునిక అంచనా పద్ధతులు, విద్యార్థులను చైతన్యపరచడం వంటి ముఖ్య అంశాలపై దృష్టి పెట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సిద్ధాంత పరమైన అంశాలతో పాటు ప్రాక్టికల్ యాప్లికేషన్లను కూడా బోధించారని, తద్వారా అధ్యాపకులు తమ బోధనా విధానాలను మెరుగుపరచుకునే అవకాశం ఉందన్నారు. ఆర్కిడ్స్ పాఠశాలలో తాము తమ అధ్యాపకుల నిరంతర అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతం

- టిపిటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక.. జిల్లా అధ్యక్షులుగా సిహెచ్.అనిల్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో టిపిటిఎఫ్ జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు పి.మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు వారు చేసిన పోరాటాలు, సాధించిన విజయాలపై, ఉపాధ్యాయుల కోసం చేసిన కృషిపై సమీక్షించారు. అనంతరం టిపిటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ వ్యవహరించగా, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి వ్యవహరించారు. అధ్యక్షులుగా సిహెచ్.అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా కే నలినిదేవి, టి.శ్రీనివాస్, జి.రాజశేఖర్, కె.శ్రీనివాస్, డాక్టర్ పి.నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.లింగం, సహాయ కార్యదర్శులుగా సిహెచ్.లక్ష్మి, పి.విజయశ్రీ, సిహెచ్.నాగేంద్ర ప్రసాద్, కే నాగేందర్, గోపు శ్రీనివాస్, ఎ.కృష్ణ, బి.రూప్‌సింగ్‌ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తాము ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతూనే ఉంటామన్నారు. ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా తమ సంఘం ముందుండి వాటి పరిష్కారానికి పోరాడుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీఎఫ్ నాయకుడు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | నవంబర్ 11, 2024 | www.navatelangana.com

అభయ హస్తం కాలనీలో దుప్పట్లు, స్వెట్టర్ల పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని అభయ హస్తం కాలనీలో నివసిస్తున్న నిరుపేదలకు ఇండోరోస్ నర్సరీ ప్రొప్రైటర్ సయీద్ సహకారంతో 50 కుటుంబాలకు, దుప్పట్లు, స్వెటర్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. ధనం అనేకమంది దగ్గర ఉంటుంది కానీ దానం చేసే గుణం కొద్దిమందిలో మాత్రమే ఉంటుందన్నారు. చలికాలం చలి తీవ్రత దృష్ట్యా శివారు ప్రాంతాల్లోని ప్రజలకు దుప్పట్లు, చిన్నపిల్లలకు స్వెటర్లు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. గతంలో కూడా కాలనీ ప్రజల దాహార్తి తీర్చడం కోసం సొంత ఖర్చులతో బోర్ వేయించారని తెలిపారు. ఈయనకు ప్రజల అండ దండలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో అభయ హస్తం కాలనీ అధ్యక్షులు దేరంగుల కృష్ణ, మునావర్, లక్ష్మణ్, అఖిల్, ఆకాష్, సునీత, కావేరి, సాయవ్వ, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ- నిజామాబాద్ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను ముఖ్యమంత్రి కి తెలియజేయాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే బి సుదర్శన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని, నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిటెడ్ వ్యాల్యూ ఆఫ్ పెన్షన్ రికవరీని 11 సంవత్సరాలకు కుదించాలని, ఈ కుబేర్ లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని తదితర దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను జిల్లా కమిటీ ఎమ్మెల్యేకు వివరించింది. తప్పక ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చినట్టు తెలిపారు. ఎంఎల్ఏను కలిసినవారిలో జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్రావు, కోశాధికారి ఈవిల్ నారాయణ, నిజామాబాద్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు, కార్యదర్శి ప్రసాద్ రావు, జిల్లా నాయకులు లావు వీరయ్య, లక్ష్మీనారాయణ, రాధా కిషన్, పూర్ణచంద్రరావు, భోజరావు, మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోగల ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్, ఏబీసీ సెంటర్, వీధి కుక్కల నియంత్రణ కేంద్రంను నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ ఆదివారం పర్యవేక్షించారు. వీధి కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.. కుని ఆపరేషన్లపై పలు వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేనేజర్ జనార్ధన్, సాల్మన్ రాజ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

గడుగు గంగాధర్‌కు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ అండ్ పార్మర్ కమిషన్ కమిటీ సభ్యులు గడుగు గంగాధర్‌ని నిజామాబాద్ బార్దాన్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్టియుసి) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు మల్యాల గోవర్ధన్, ధ్యారంగుల కృష్ణ, బార్దాన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దండె రాము, విజయ్, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయ్ హైస్కూల్ 43వ టాలెంట్ షో

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి విజయ్ హై స్కూల్ 43వ టాలెంట్ షో నేడు నిర్వహిస్తున్నట్టు ప్రముఖ రచయిత్రి, విద్యాసంస్థల యజమానురాలు డాక్టర్ అమృతలత ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ టీవీ యాంకర్ ఉదయభాను, తెలుగు డిప్యూటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సిహెచ్. సుశీలమ్మ తదితరులు వస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఆర్పీలకు సర్వే డబ్బులు చెల్లించినట్లు చెప్పడం సరికాదు

మెప్మా ఆర్పి జిల్లా అధ్యక్షురాలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వర్ణలత

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఆర్పీలకు సర్వే డబ్బులు చెల్లించినట్లు సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది తెలపడం సరైనది కాదని, మెప్మా ఆర్పి జిల్లా అధ్యక్షురాలు రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వర్ణలత ఆదివారం ఖండించారు. సర్వే డబ్బులు ఇవ్వకుండా ఇచ్చినట్లు ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ఆర్పీలు సుముఖంగా ఉన్నప్పటికీ, అధికారుల నుండి సరైన సమాధానం రాకపోవడంతో ఆర్పీలు సర్వేకు దూరంగా ఉన్నట్లు తెలిపారు. ఇంత వరకు సుమారు 50 రకాల సర్వేలు నిర్వహించిన , హానరోరియం చెల్లించడంలో అధికారులు వైఫల్యం చెందారన్నారు. చాలి చాలని వేతనాలు ఇస్తూ సర్వే డబ్బులు చెల్లించడం లేదన్నారు. సమగ్ర కుటుంబ సర్వే డబ్బులు ఇతర ప్రాంతంలో 10 వేలు ఇస్తామని అధికారులు చెప్పిన, నిజామాబాద్‌లో ఏ ఒక్క అధికారి తమకు చెప్పినట్లు దాఖలాలు లేవన్నారు. టిఎంసి అసత్యపు మాటలతో అధికారులను తప్పుదోవబట్టిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు.

కార్తికేయ సర్వీసెస్ ఔట్ సోర్సింగ్ టెండర్ రద్దు చేయాలి : బీఎల్‌టీయూ

నవతెలంగాణ-కంఠేశ్వర్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విధుల నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల టెండర్ టైం మార్చి నెల వరకు ఉన్నప్పటికి 8 నెలల ముందే కొత్తగా కార్తికేయ సర్వీసెస్ హైదరాబాద్ వారికి కాంట్రాక్ట్ ఇచ్చారని, కానీ ఆ కాంట్రాక్టర్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ ఇన్సూరెన్స్ చెల్లించడం నిర్లక్ష్యం చేస్తున్నందుకు కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ టెండర్‌ను రద్దు చేసి ఔట్ సోర్సింగ్ కార్మికుల హెల్ప్ గ్రూప్‌ల ద్వారా వేతనాలు చెల్లించాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్- నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్- (బిఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల నెల వేతనాలు వేసే సందర్భంగా కొంత మంది కార్మికులకు బ్యాంక్ లో డబ్బులు వేయడం లేదన్నారు. కార్మికులు ఫోన్‌చేసి అడిగితే రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ధ్దరా పండుగ రోజున జోన్-2 లో పని చేసే మధుకు జీతం వేయలేదని, కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా ఇబ్బంది పడ్డదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఫోన్ చేసినా స్పందించడంలేదని, యూనియన్ నాయకులు ఫోన్ చేసి కార్మికుల సమస్యలు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల వేతన డబ్బులు బ్యాంక్‌లో ఎందుకు వేయడం లేదని ప్రశ్నిస్తే వివరాలు సరిగా లేవని బుకాయిస్తున్నారని తెలిపారు. 20 సంవత్సరాల నుండి పని చేస్తున్న కార్మికుల వివరాలు కొత్తగా వచ్చిన కార్తికేయ సర్వీసెస్ కాంట్రాక్టర్ రాగానే మాయమవుతాయా అని ప్రశ్నించారు. అదేవిధంగా కార్మికుల కుటుంబ సభ్యుల పేరుపై ఔట్ సోర్సింగ్ కార్మికుల మార్పు విషయంలో కార్తికేయ సెక్యూరిటీ సర్వీస్ నుండి మున్సిపల్ కార్పొరేషన్ కు లెటర్ కోసం రెండు నెలలుగా ఫోన్ చేస్తే లెటర్స్ ఇవ్వడం లేదన్నారు. గతంలో ఉన్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్లు ఈవిధంగా ఎప్పుడు వ్యవహరించలేదని, కావున కార్తికేయ సర్వీసెస్‌కు వెంటనే నోటీసులు జారి చేసి ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేసి కార్మికుల సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల ద్వారా వేతనాలు చెల్లించాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి ఉంటుంది హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్-(బిఎల్‌టియు) నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, వాటర్ సప్లై యూనియన్ కార్యదర్శి ఎ.హరిష్, నాయకులు మురళి, శ్రీశైలం, విశ్వనాథ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను

సొంత జిల్లాలకు బదిలీ చేయాలి

- కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలి
- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేపీసీ ప్రతినిధుల నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత ప్రభుత్వం జారీ చేసిన 317 జీవోతో అనేక మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని, వెంటనే బాధితులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. 317 జీవో 317 డిస్లోకేటేడ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ (డేటా) ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టారు. వీరికి టీఎస్‌యూటీఎఫ్, పీఆర్‌టీయూ, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపి మాట్లాడారు. నిజామాబాద్‌లో 317 జీవోలో భాగంగా జిల్లాలు మారిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ న్యాయం కోసం ధర్మ పోరాటంలో దీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ వారి జిల్లాలకు కేటాయించాలని అన్నారు. గత ప్రభుత్వం హయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల వల్లనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యున్నతి సాగుతుందని, ఉపాధ్యాయులు మాత్రం ఇతర జిల్లాలకు పంపడం వలన కుటుంబానికి దూరమై, చిన్న చిన్న పిల్లలను వదిలేసి ఎంతో మానసిక వేదన అనుభవిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. రాష్ట్ర నాయకులు పడకంటి అజయ్ కుమార్, నిజామాబాద్ జిల్లా నాయకులు దినేష్ మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయుల వల్లనే విద్యార్థులు భవిష్యత్తు బాగవుతుందని ఉపాధ్యాయులకు బాసటగా నిలవాలని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఎంతైనా ఉందని గుర్తు చేశారు.ప్రధాన డిమాండ్లుగా 317 జీవోపై ఏర్పాటుచేసిన సబ్ కమిటీ ఇచ్చిన రిపోర్టును బహిర్గతం చేయాలని అన్నారు.ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేని, జిల్లాలు మారిన ఉపాధ్యాయులను వెంటనే సొంత జిల్లాలకు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే 317 జీవోను సవరించి భాధితులందరికీ సత్వర న్యాయం చేయాలన్నారు. 317 జీవో సమస్య గూర్చి, వాటి పరిష్కార మార్గాల గూర్చి ఉపాద్యాయ సంఘ నాయకులు చర్చ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి మద్దతుగా టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్షులు సత్యానంద్, పీఆర్‌టీయూ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ నాయకులు కృష్ణవేణి, శ్రీకాంత్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెనిగళ్ల సురేష్ పాల్గొని మద్దతు ప్రకటించారు. నిరసనలో 'డేటా' నాయకులు సురేష్, మారుతి, అనంతజీవి, ప్రవీణ్, వినాయక్, నర్సయ్య, శివ ప్రసాద్, రాజేష్, రమేష్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నిరసనకు మద్దతు తెలుపుతూ మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సత్యానంద్



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని పద్మ నగర్ కోటగల్లీలోని వివేకానంద విద్యాలయం ఉన్నత పాఠశాలలో 1997-98 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నగరంలోని ఏయస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన విద్యార్థులంతా సమావేశమై ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యా బోధన చేసినా గురువులు హాజరై తమ అమూల్యమైన సందేశాలను అందించారు. ఈ సందర్భంగా గురువులను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. పూర్వ విద్యార్థులంతా చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు.

మల్లికార్జున ఖర్గేను కలిసిన నేషనల్ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎన్నికల ప్రచారం తర్వాత మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గేను యూత్ కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ నరాల నిహార్ కలిశారు. మల్లికార్జున్ ఖర్గేను కలవడం గొప్ప అవకాశం అని అన్నారు.



శీతాకాలపు వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



నవతెలంగాణ- కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కమ్మర్‌పల్లి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శీతాకాలపు వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ఎస్ఐ అనిల్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసిన కమ్మర్ పల్లి వాలీబాల్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు ఈ శిక్షణ శిబిరాన్ని ఆసక్తి ఉన్న క్రీడకారులు వినియోగించుకోవాలి ఎస్ఐ అనిల్‌రెడ్డి కోరారు.30 రోజుల పాటు శీతాకాలపు వాలీబాల్ శిక్షణ శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం, 5:30 నుండి 7:00 వరకు సాయంత్రం 5:30 నుండి 7:30 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించబడుతుందని వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు సమాచారం కోసం సెల్ నెం : 72869 76326 కార్తీక్ ని సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో కమ్మర్ పల్లి వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అజరుద్దీన్, ఉపాధ్యక్షుడు రంజిత్ కుమార్, కార్యదర్శి వంశీ, కోచ్ చైతన్య వుట్నూర్, కార్తీక్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

- తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ చూపాలి
- విజయ్ పాఠశాల టాలెంట్ షో ముగింపులో వక్తలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అన్ని రంగాలలో విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని, ప్రతి ఒక్కరికి జ్ఞానం ముఖ్యమైనదని వసంత టూల్స్ క్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దయానంద్ రెడ్డి అన్నారు. ఈఆదివారం విజయ్ పాఠశాల 44 వ టాలెంట్ షో ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దయానంద్ రెడ్డి, ద్వి భాష రచయిత, జర్నలిస్ట్ అండ్ ట్రాన్స్‌లేటర్ అంబికా ఆనంద్ హాజరయ్యారు. ముందుగా నిరుపేదలకు విద్యను అందించేందుకు కృషి చేయడమే కాకుండా వృద్ధుల కోసం ఆలంబన వృద్ధాశ్రమం(అంకాపూర్) ఏర్పాటు చేసిన (గడ్డం రాజిరెడ్డి) పైపుల రాజిరెడ్డి మన మధ్య లేకపోవడం బాధాకరమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దయానంద్ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తు లో విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే చదువు చాలా ముఖ్యమన్నారు. క్రమశిక్షణ ఉన్నప్పుడే ముందుకు వెళ్లడం సాధ్యమవుతుందన్నారు. నేర్చుకున్నప్పుడే సమాజంలో మంచి పేరు, మంచి మనిషిగా గుర్తింపు లభిస్తుందన్నారు. కల్చరల్ యాక్టివిటీస్ తో పాటు క్రీడలు తదితర రంగాలలో విద్యార్థులు ముందుకు వెళ్లడం చాలా గొప్ప విషయం అన్నారు. ద్వి, భాష రచయిత,జర్నలిస్ట్ అండ్ ట్రాన్స్‌లేటర్ అంబికా ఆనంద్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను సంరక్షిస్తూనే వారికి చిన్నతనం నుండే అన్ని పనులను అలవాటు చేయించాలన్నారు. తల్లిదండ్రులు కాలక్షేపం చేయకుండా పిల్లలతో సంతోషంగా గడపాలన్నారు. పిల్లలపై శ్రద్ధ చూయించినప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. డబ్బుల విషయం పిల్లల ముందు మాట్లాడకూడదన్నారు. చిన్నతనం నుండి ప్రతి ఒక్కటి విద్యార్థులకు తెలియజేస్తూనే భవిష్యత్తు కార్యాచరణ చెప్పాల్సిన బాధ్యత పాఠశాలలో గురువులదైతే ఇంటి వద్ద తల్లిదండ్రులదే అని తెలియజేశారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు...

వార్షికోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభా పురస్కారాలను అందించారు. అనంతరం ముఖ్య అతిథులను విజయ్ పాఠశాల తరఫున మెమెంటో, శాలువాలతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి అమృతలత, రమాదేవి, లలిత దేవి, విజయ భారతి, విజయ లక్ష్మి, మధు, కరస్పాండెంట్ ప్రభాదేవి అకాడమిక్ డైరెక్టర్ వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపల్ విజేత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న పాఠశాల యాజమాన్యం, తదితరులు



అతిథిని సన్మానిస్తూ...

సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలి

మున్సిపల్ కమిషనర్ రాజు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పరిశీలన

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ :ఎన్యుమరేటర్లు సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 4, 6వ వార్డుల్లో చేపడుతున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సర్వేను కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ చెన్నయ్య, ఎన్యుమరేటర్లు గంగారెడ్డి, దిలీప్, గీత తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:మండలంలోని బట్టాపూర్ గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకొని, సర్వేపై సందేహాలను నివృత్తి చేశారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు తమ ఇండ్లకు వచ్చినప్పుడు సరియైన వివరాలను తెలిపి వారికి సహకరించాలని కోరారు. ఎంపీడీఓ తో పాటు పంచాయితీ కార్యదర్శి రవి ఉన్నారు.

డిచ్‌పల్లి:కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే కు ప్రజలు సహకరించాలని ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ అన్నారు. ఆదివారం ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామంలోని 3వ వార్డు లోని డబుల్ బెడ్రూం కాలనీలో ఇంటింటా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం కూడా చేయని కులగణన సర్వేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించి పకడ్బందీగా చేయడానికి ఇప్పటికే ఆదేశాలను జారీ చేశారని మోత్కురి నవీన్ గౌడ్ అన్నారు. సర్వే ఆధారంగా ఆయా కులాలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి లబ్ది చేకుర్చే విధంగా ముఖ్యమంత్రి ప్రయత్నాలు చేస్తున్నారని దినికి ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సర్వేలో గ్రామ పంచాయతీ కార్యదర్శి చుక్కబోట్ల భరత్, కారోబర్ పోచయ్య, బీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ :మండలంలోని బైరాపూర్ గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆర్‌డిఓ పరిశీలించారు. అనంతరం కుటుంబ సర్వేను పకడ్బందిగా నిర్వహించి సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గోవింద్, ఎంఆర్ఓ రామేశ్వర్ రావు, పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : ఇందల్‌వాయిలో...

మోపాల్ :మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఆదివారం సమగ్ర కుటుంబ సర్వేను మండల పంచాయతీ అధికారి కిరణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఎన్యుమేరేటర్లు అడిగిన వాటికి సరైన సమాధానాలు ఇస్తూ వారికి తమ కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, ఎన్యుమరేటర్ విజయ, తదితరులు పాల్గొన్నారు

కమ్మర్‌పల్లి :అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వర్తింపజేయాలని సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టిందని ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజరాజేశ్వరి నగర్, ఉప్లూర్ గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఆయన తహసిల్దార్ ఆంజనేయులుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సర్వే విషయంలో ప్రజలు ఎలాంటి అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనవకుండా ఎన్యుమారేటర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వేప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యుమారేటర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించేందుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. కుటుంబాలకు గుర్తింపు విజయవంతంగా ముగిసిందని, అదేవిధంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయ్యేంతవరకు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్వే పూర్తిచేయాలన్నారు.

ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమ నాయకుడు న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం


లా సర్టిఫికెట్‌తో స్టాలిన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమ నాయకుడు శ్రవణ్ కుమార్ అలియాస్ స్టాలిన్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేసినట్టు ఆదివారం తెలిపాడు. వివరాలిలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం కాచాపూర్ గ్రామంలోని బిస్క పరమేశ్వర్, మణెమ్మ దంపతుల కుమారుడు శ్రవణ్ కుమార్ అలియాస్ స్టాలిన్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేశారు. విద్యార్థి ఉద్యమ నాయకుడిగా గ్రామస్థాయి నుంచి విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొంటూ జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల పక్షం నిలబడి ఎన్నో విద్యార్థులు ఉద్యమాల్లో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని వివిధ గ్రామాలను తహసీల్దార్ సతీష్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ప్రత్యేక ఓటర్ దినోత్సవం సందర్భంగా గుర్జల్ తండా, రామలక్ష్మణపల్లి, మాతు సంగెం పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే ఎస్ఈఎస్ సర్వేను, వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి రాజా శ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంతల హైవే

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని హైవే అథారిటీ అధికారులు


హైవేరోడ్డుపై ఏర్పడిన గుంతలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని 44వ జాతీయ రహదారి గుంతల మయంగా మారింది. మండలంలోని స్నేహ పౌల్ట్రీ ఫార్మ్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినప్పటికీ హైవే అథారిటీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. టోల్‌ప్లాజా నిర్వాహకులకు వసూళ్ల మీద ఉన్న శ్రద్ధ రోడ్లను బాగు చేయడంలో లేదని పలువురు విమర్శిస్తున్నారు. ముందర గుంత మరికొద్ది దూరంలో స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా హైవే అథారిటీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.



పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ పరిధిలోని ఆటోనగర్ ప్రాంతంలో ఆదివారం బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తన సిబ్బందితో కలిసి పీడీఎస్ బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నాయని గుర్తించి వాహనాన్ని పంచనామా చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

గాడిద పాలకు భలే డిమాండ్

నవతెలంగాణ-సదాశివనగర్


గాడిద పాలు అమ్ముతున్న పెంపకందారుడు

గాడిద పాలకు భలే డిమాండ్ నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో గాడిద పెంపకందారులు గాడిద పాలను ఊరూరా తిరుగుతూ విక్రయిస్తున్నారు. గాడిద పాలు 80 మిల్లీమీటర్లకు రూ.180 కి విక్రయిస్తున్నారు. ఈ గాడిదపాలతో చిన్న పిల్లలకు ఉబ్బసం, జ్వరం, వాంతులు, వీరోచనాలు, రకరకాల జ్వరాలు తగ్గుతాయని పాల విక్రయదారులు చెబుతున్నారు. పెద్దలకు సైతం కాళ్ల, కీళ్ల నొప్పులకు ఉపయోగపడుతుందని వివరిస్తున్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్‌అలీ కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ఎఫ్ ఫైళ్లను ముఖ్యమంత్రితో మాట్లాడి కామారెడ్డి నియోజకవర్గంలో ఆదివారం దాదాపు 150 మందికి సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేయించి చెక్కులను అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లంబాడిల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కాట్రోత్ రవీందర్ నాయక్



నవతెలంగాణ-పిట్లం

లంబాడీల ఐక్యవేదిక నూతన రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కాట్రోత్ రవీందర్ నాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా లంబాడీల ఐక్యవేదిక నూతన కోఆర్డినేటర్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతి ప్రయోజనాల కోసం నిరంతరం పాటుపడతానన్నారు. లంబాడీల ఐక్యవేదిక లక్ష్యాలను, భాషా గుర్తింపు కోసం రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్ చేర్పించడానికి కృషి చేస్తానన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి, శీతల, తీజ్ లాంటి గోర్ దాటికి చెందిన పండగలను రాష్ట్ర తెలుగు దినాల జాబితాలో చేర్పించుటకు, ప్రతి తాండాను రెవిన్యూ గ్రామపంచాయతీగా, కమ్యూనిటీ హాల్స్, జిల్లా, నియోజకవర్గాలలో గిరిజన భవన్, ప్రత్యేక ఎస్టి కమిషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్‌కుమార్, రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేష్‌కు అభినందనలు తెలియజేస్తూ రుణపడి ఉంటానని అన్నారు.

మెట్ల బావిని సందర్శించిన మాజీ జెడ్పీటిసి

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ఉన్న చారిత్రాత్మక నాగన్నగారి మెట్ల బావిని నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటిసి మనోహర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. నాగన్నగారి మెట్ల బావికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషిచేస్తున్న ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులను, బృందం సభ్యులను మనోహర్ రెడ్డి అభినందించారు. చారిత్రక కట్టడాలు చరిత్రలో నిలిచిపోతాయని ఆయన అన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ


సురేష్‌ను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన బీజేపీ మండల మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులైన ఉప్పు సురేష్ సుమారు నెల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో బీజేపీ సీనియర్ నాయకులు ఆయనను ఆదివారం పరామర్శించారు. జరిగిన ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షులు కోల ఇంద్రకరణ్, సీనియర్ నాయకులు న్యావానంది గోపాల్, మాజీ ఎంపీటీసీ మంద సంజుకుమార్, సృజన్, స్థానిక నాయకులున్నారు.

పైడి ఎల్లారెడ్డి వ్యవసాయం.. ఆదర్శం

- పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డి


వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

పైడి ఎల్లారెడ్డి వ్యవసాయం.. ఇతరులకు ఆదర్శమని పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డి అన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తూ.. ఇతరులకు సేంద్రియ వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తున్న ప్రముఖ పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డి ఆదివారం కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామ శివారులో గల ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి చేస్తున్న ఈ వ్యవసాయం ఇతరులకు ఆదర్శమని తెలిపారు. ఈ ఫామాయిల్ ఫార్మింగ్ చేయడం మంచి నిర్ణయమన్నారు. ఫామాయిల్ ఫార్మింగ్‌లో సేంద్రియ వ్యవసాయం చేసేందుకు తాము నిరంతరం కృషి చేస్తామని తెలియజేశారు. తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించినందుకు పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డికి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అమూల్య ఆశ్రమానికి రూ.5 వేలు విరాళం

- అందజేసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బాయంపల్లి తండాలో గల అమూల్య ఆశ్రమానికి కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం సందర్శించారు. అమూల్య ఆశ్రమ స్వచ్ఛంద సంస్థ పనితీరును నిర్వాహకులు రవీందర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛంద సంస్థ ఆశ్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి వృద్ధులకు సేవలు అందించడం మర్చిపోలేమన్నారు. అనంతరం రూ.5వేలను స్వచ్ఛంద సంస్థకు విరాళంగా అందజేశారు. వీరికి అమూల్య వృద్ధుల ఆశ్రమం స్వచ్ఛంద సంస్థ ట్రస్టు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంజరి ఎల్లమ్మయ్య, ఆర్ఎంపి అసోసియేషన్ మండల అధ్యక్షులు డాక్టర్ విట్టల్, కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ రాజప్ప దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి



నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రానికి చెందిన సిందే రాజు పటేల్ గత నాలుగు రోజుల క్రితం గాంధారి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. రాజు మృతితో గాంధారిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మా పొట్ట కొట్టొద్దు

- క్యాబ్ డ్రైవర్ల ఆవేదన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కొంతమంది ప్రైవేటు పాఠశాలల బస్సులను అద్దెలకు ఇచ్చి క్యాబ్ డ్రైవర్లకు కిరాయిలు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పట్టణంలోని క్యాబ్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి క్యాబ్ డ్రైవర్లకు కిరాయిలు రాకుండా చేసిందని, అరకొర కిరాయిలతో కాలం వెళ్లదీస్తున్న నేపథ్యంలో కొంతమంది ప్రైవేటు పాఠశాలల బస్సులను ఫంక్షన్లకు, సమావేశాలకు అద్దెలకు ఇచ్చి తమకు పూర్తిగా అద్దెలు దొరకకుండా చేస్తున్నారని, బస్సులకు బ్యానర్లు కట్టుకొని యథేచ్ఛగా కిరాయిలకు నడుపుతున్న పాఠశాలల బస్సులపై అధికారులు చర్యలు తీసుకోవాలని క్యాబ్ డ్రైవర్లు విజ్ఞప్తి చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తాడ్వాయి

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని చంద్రపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాకలి సాయిలు (48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మద్యానికి బానిసై ఇంట్లో తరచూ గొడవ పడేవాడు. గత నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లల్లో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించడంతో భార్య రాజమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డవారిని పోలీసు వాహనంలో తరలింపు



బాధితులను పోలీసు వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ నుంచి మేనూర్ మార్గంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి ఆదివారం బోల్తా పడటంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న ఎస్సై విజయ్ కొండ వెంటనే స్పందించి గాయాలైన వారిని పోలీసు వాహనంలో ఎక్కించి మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలై ఇబ్బంది పడుతున్న సమయంలో పోలీసులు వచ్చి వారి వాహనంలో ఆసుపత్రికి తరలించడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. మానవత్వం చాటుకున్న ఎస్సై విజయ్ కొండ, పోలీస్ సిబ్బందిని ప్రజలు అభినందించారు.

సమగ్ర కులగణన సర్వేకు సహకరించండి

- ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ ఉగ్రవాయి బోలేశ్వర్


మాట్లాడుతున్న బోలేశ్వర్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేను ప్రజలంతా స్వాగతించి సహకరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ ఉగ్రవాయి బోలేశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమక్షంలో ఆయన మాట్లాడుతూ కుల గణన సర్వే భారత రాజ్యాంగ మూల సిద్ధాంతంపై ఆధారపడిందని తెలిపారు. ప్రభుత్వం సర్వే రిపోర్ట్‌ని త్వరగా తెప్పించి రాష్ట్రంలో రాజకీయ, ఆర్థిక సంపదలో సామాజిక న్యాయాన్ని 90 శాతం అణగారిన కులాలందరికీ సమానంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ రాజు మహారాజ్, జిల్లా కమిటీ సభ్యులు గంగరాజు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

- సింగిల్ విండో చైర్మన్ కపిల్ రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-తాడ్వాయి

రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సోమారం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తూకంలో తేడాలు రావొద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే


ఎల్లారెడ్డి : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో


నాగిరెడ్డిపేట్ : సర్వేను నిర్వహిస్తున్న అధికారులు


మద్నూర్ : సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

- పరిశీలించిన అధికారులు
- ఎన్యుమరేటర్లకు సూచనలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే కొనసాగుతోంది. కాగా ఆదివారం నిర్వహించిన సర్వేను అధికారులు పరిశీలించి ఎన్యుమరేటర్లను పలు సూచనలు చేశారు.

కామారెడ్డి : పట్టణంలో ఇంటింటి సమగ్ర సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. అందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇండ్ల వద్దకు వెళ్లి ప్రత్యేకంగా వివరాలు సేకరిస్తున్నారు. ముందుగా స్టిక్కర్లు అతికించిన ఇళ్ల వద్దకు వెళ్లి సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం 14వ వార్డులోని కాకతీయనగర్ కాలనీలో వివరాలు సేకరించారు.

సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

ఎల్లారెడ్డి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో ప్రకాష్ పరిశీలించారు. మండల పరిధిలోని మీసన్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించి కుటుంబంలోని ప్రతి వ్యక్తి వివరాలను సేకరించాలని ఎన్యుమరేటర్‌లకు సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన..

నాగిరెడ్డిపేట్ : మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో ప్రభాకర్ చారి పరిశీలించారు. మండలంలోని చినూరు గ్రామంలో సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి సురేందర్‌కు ఆయన సూచించారు.

లింగంపేట్ : పట్టణ కేంద్రంలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేటర్లు సర్వే చేపడుతున్నారు. సర్వేను డిప్యూటీ తహసీల్దార్ సంగమేశ్వర్ పరిశీలించారు. సర్వేలో తప్పులు లేకుండా చూడాలన్నారు. సర్వేలో ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలను నమోదు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. అత్యవసర పనిమీద ఇండ్లకు తాళం వేసి వెళ్తే చుట్టుపక్కల వారికి సమాచారం అందించాలని, తాళం వేసిన వారు తిరిగొచ్చాక సర్వే చేస్తామని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి శ్రావణ్ కుమార్ సర్వే సిబ్బంది ఉన్నారు.

కందకుర్తి గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే..

రెంజల్ : మండలంలోని కందకుర్తి గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి 75 అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందుపరుస్తున్నట్టు ఎన్యుమరేటర్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జి గ్రామ కార్యదర్శి భాస్కర్, కారోబార్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి..

మద్నూర్ : సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ రేణుక చౌహన్ అన్నారు. ఆదివారం డోంగ్లి మండలంలో కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వేను తహసీల్దార్ రేణుక చౌహన్ పరిశీలించారు. డోంగ్లి మండల కేంద్రంతో పాటు డోంగ్లి మండలంలోని కుర్లా గ్రామంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు.ట